గ్రూపు-2 అభ్యర్థుల కోసం హెల్ప్‌డెస్క్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఈ నెల 25వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గ్రూప్-2 పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో అభ్యర్థుల సౌకర్యార్థం జిల్లా కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. జిల్లాలో 39 పరీక్షా కేంద్రాల్లో గ్రూపు-2 పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్‌తో కూడిన కంట్రోల్ రూమ్‌లో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్షన్ ఆఫీసర్లు ఎఎం.మాధవీలత (9014550897), పి.గిరిజారాణి (9912107709), కె.చంద్రశేఖరరెడ్డి కో-ఆర్డినేషన్ సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్ కెవివి విగ్నేష్, బి. పావని (9491041436), అందుబాటులో ఉంటారన్నారు.

ఎన్నికల కోలాహలం..!

అధినేతల పర్యటనలతో వేడెక్కుతున్న రాజకీయం

నియోజకవర్గాల్లో పోటాపోటీగా ప్రచారం

అభ్యర్థుల ప్రకటనపై తాత్సారంతో జనసేన, టిడిపి శ్రేణుల్లో నిస్తేజం

భీమవరంలో పవన్ పోటీకి సిద్ధమవడంతో విస్తృత చర్చ

గత ఎన్నికల ఓట్ల లెక్కలతో గెలుపోటములపై అంచనాలు

తాడేపల్లిగూడెంలో టిడిపి, జనసేన సభకు విస్తృత ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. అధినాయకుల పర్యటనలతో రాజకీయం రసవత్తరంగా మారుతోంది. ఇప్పటికే దెందులూరులో సిఎం సభ జరగడం, భీమవరంలో సాగిన పవన్ పర్యటనతోపాటు ఈ నెల 28న తాడేపల్లిగూడెంలో జరుగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి ఎన్నికల సభతో ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తల్లో ఎన్నికల కోలాహలం మొదలైంది. గ్రామాల్లో సైతం ఏ ఇద్దరు కలిసినా ఎన్నికలపై చర్చ సాగుతోంది. నియోజకవర్గాల్లో టిడిపి, జనసేన, వైసిపి నాయకులు తమ ఎన్నికల ప్రచారాన్ని మరింత ముమ్మరంగా సాగిస్తున్నారు. ఇప్పటి నుంచే ఏ పార్టీ ఎన్ని సీట్లు సాధిస్తుందనే లెక్కలు కడుతున్న పరిస్థితి ఉంది. టిడిపి, జనసేన పార్టీలకు సంబంధించి అభ్యర్థుల ప్రకటన వెలువడకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో కొంత నిస్తేజం కొనసాగుతోంది. తాడేపల్లిగూడెంలో జరుగనున్న టిడిపి, జనసేన ఉమ్మడి సభను విజయవంతం చేసేందుకు ఆయా పార్టీల నాయకులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. అదే సమయంలో బిజెపి సైతం ఏలూరు ఇండోర్‌స్టేడియంలో ఈ నెల 27న ప్రజాపోరు పేరుతో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ముఖ్యఅతిథిగా ఎన్నికల సభ జరిపేందుకు సిద్ధమైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో రోజురోజుకీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతోంది. త్వరలో జరుగనున్న ఎన్నికల సరళిపై అనేక రకాలుగా రాజకీయ విశ్లేషణలు సాగుతున్నాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలు ఉన్నాయి. 2014 ఎన్నికల్లో 15 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలను టిడిపి, బిజెపి పొత్తులో భాగంగా గెలుచుకున్నాయి. ఆ ఎన్నికల్లో జిల్లా నుంచి వైసిపికి అసెంబ్లీలో ప్రాతినిధ్యం అనేది లేకుండాపోయింది. 2019 ఎన్నికలొచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. 15 అసెంబ్లీ స్థానాల్లో 13, రెండు ఎంపీ స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్ సైతం ఓటమి పాలయ్యారు. రెండుసార్లు రాష్ట్రంలో అధికారంలో రావడానికి జిల్లాలో గెలుపొందిన స్థానాలు ఆయా పార్టీలకు కీలకంగా మారాయి. దీంతో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాపై వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ప్రధానంగా కేంద్రీకరించిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో అత్యధిక స్థానాలను దక్కించుకుంటేనే అధికారంలోకి వస్తామని అంచనా వేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో టిడిపి, జనసేన ఉమ్మడి పొత్తుతో ముందుకు నడుస్తున్నాయి. జిల్లాలో కాపు సామాజిక తరగతి ఓట్లు అత్యధికంగా ఉన్నాయి. దీంతో టిడిపి, జనసేనకు ఎన్ని స్థానాలు వస్తాయి, వైసిపికి ఎన్ని స్థానాలు వస్తాయనే లెక్కలు ముమ్మరంగా సాగుతున్నాయి. గత ఎన్నికల్లో టిడిపికి, జనసేనకు వచ్చిన ఓట్లను నియోజకవర్గాల వారీగా లెక్కలు తీస్తున్నారు. 2019లో భీమవరం నుంచి పోటీ చేసిన పవన్‌కల్యాణ్ 8,400 ఓట్ల తేడాతో వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై ఓటమి పాలయ్యారు. ఆ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులుకు 50 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. దీంతో టిడిపి, జనసేన ఓట్లు కలిస్తే పవన్ కచ్చితంగా గెలుస్తాడని అంచనాలు వేస్తూ ఇప్పటి నుంచే బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. ఏలూరు నుంచి టిడిపి తరపున పోటీ చేసిన బడేటి చంటి స్వల్ప తేడాతో ఓటమి చెందారు. ఆ ఎన్నికల్లో జనసేన అభ్యర్థికి 15 వేలకుపైగా ఓట్లు వచ్చాయి. ఈసారి రెండు పార్టీలు కలిసి పోటీ చేయడంతో గెలుపు తథ్యమని లెక్కలు కడుతున్నారు. ఇలా ప్రతి నియోజకవర్గంలోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ఆధారంగా గెలుపోటములపై అంచనాలు వేస్తున్నారు. తాము చేపట్టిన సంక్షేమ పథకాలు తమను కచ్చితంగా గెలిపిస్తాయని వైసిపి ధీమాగా ఉంది. టిడిపి, జనసేనతో బిజెపి పొత్తు కుదుర్చుకున్నా జిల్లాలో ఒరిగేదేమీ పెద్దగా కలిసొచ్చే అంశం కన్పించడం లేదు. అనేక లెక్కలు, ప్రచారాలతో ఎన్నికల కోలాహలం సాగుతోంది.

రైతులపై బిజెపి ప్రభుత్వాల దమనకాండను నిరసిస్తూ..

రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యాన బ్లాక్‌డే

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఢిల్లీ సరిహద్దుల్లో సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల ఆందోళనపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, హర్యానా బిజెపి ప్రభుత్వం ఈ నెల 21న అమానుషంగా సాగించిన పోలీసు దాడుల్లో ఒక యువరైతు మరణించడంపై కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం బ్లాక్ డే నిర్వహించారు. రైతుల ఆందోళనలపై పోలీసు కాల్పులు ఖండిస్తూ శుక్రవారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యాన చేపట్టిన కార్యక్రమానికి ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా గౌరవాధ్యక్షులు కె.కృష్ణమాచార్యులు, సిఐటియు నగర అధ్యక్షులు బి.జగన్నాధం, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, 2020 విద్యుత్ సంస్కరణల బిల్లును రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని కోరుతూ రైతులు ఆందోళన చేస్తుంటే బిజెపి ప్రభుత్వాలు అమానుషంగా దాడులు చేయడాన్ని వారు ఖండించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నాలుగు కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, ఎఐటియుసి జిల్లా నాయకులు పుప్పాల కన్నబాబు, సిఐటియు నగర కార్యదర్శి వి.సాయిబాబు, ఆశా వర్కర్స్ యూనియన్ నేత దేవి పాల్గొన్నారు.

నినదిస్తున్న కార్మిక సంఘాల నేతలు

చింతలపూడి: హర్యానాలో బిజెపి ప్రభుత్వ క్రూరత్వానికి యువరైతు శుభ్‌కరణ్‌సింగ్ బలి కావడం బాధాకరమని అఖిలపక్ష రైతు సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బోసుబొమ్మ సెంటర్లో అఖిలపక్ష రైతుసంఘాల ఆధ్వర్యంలో బ్లాక్ డే నిర్వహించారు రైతాంగం అంతా నల్ల రిబ్బన్లు ధరించి నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు ఎం.వసంతరావు, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు పి.సోమశేఖర్, కౌలురైతుసంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ యువరైతు మతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ మండల కార్యదర్శులు ఆర్‌వి.సత్యనారాయణ, కంచర్ల గురవయ్య, వివిధ సంఘాల నేతలు నత్త వెంకటేశ్వరరావు, బాలరాజు, తొర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, తక్కిలపాటి ప్రసాద్, ఎస్‌కె.జానీ, తాడిగడప మాణిక్యాలరావు, మాధవరావు, సత్యనారాయణ, ఆదినారాయణ, రాఘవ, రామచంద్రరావు, అంజిబాబు, రామకృష్ణారెడ్డి, కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యం వల్లే పిల్లలకు అస్వస్థత

డిఎంహెచ్‌ఒ ఎన్.శర్మిష్ఠ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి గిరిజన సంక్షేమ వసతిగృహం సిబ్బంది నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని డిఎంహెచ్‌ఒ ఎస్.శర్మిష్ఠ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర వసతి గృహన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం వంటగది అపరిశుభ్రంగా ఉండటంతోపాటు ఈగల బెడద ఎక్కువ ఉండటాన్ని గుర్తించారు. నానబెట్టిన మినపప్పు దుర్వాసన రావడంతో సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లలకు పెట్టే ఆహార పదార్థాలు ఇలా ఉంటే విద్యార్థుల ఆరోగ్యం ఎలా ఉంటుందని ప్రశ్నించారు. వసతిగృహంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. కూరగాయలు, చికెన్, గుడ్లు వంటివి పిల్లలకు వండేటప్పుడు నాణ్యత పాటించాలని సూచించారు. అస్వస్థతకు గురైన పిల్లలందరూ ఆరోగ్యంగా వసతిగృహానికి చేరుకున్నారన్నారు. అనంతరం జీలుగుమిల్లి హాస్పటల్‌లో ఓపిని, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఎస్‌ఒ నరేంద్రకిషోర్, వైద్యాధికారి గాయత్రి, సిహెచ్‌ఒ శ్రీనివాసరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డిఎంహెచ్‌ఒ

ఓటర్ల నమోదు దరఖాస్తుల పరిశీలన వేగవంతం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఓటర్ల నమోదుకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన వేగవంతంగా సాగుతుందని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ ఎన్ఎస్‌కె.ఖాజావలి, కలెక్టరేట్ ఎఒ కె.కాశీవిశ్వేశ్వరరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు దేవరపల్లి రత్నబాబు (బిఎస్‌పి), నెరుసు నెలరాజు (బిజెపి), పి.ఆదిశేషు (సిపిఎం), ఎస్.బాబూప్రసాద్ (కాంగ్రెస్), ఎం.దశరథకుమార్ (ఆమ్‌ఆద్మీ), పాలి ప్రసాద్ (టిడిపి), కలవకొల్లు సాంబ (వైసిపి) తదితరులు హాజరయ్యారు. ఇటీవల విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాపై రాజకీయ పక్షాల పరిశీలనపై కలెక్టర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫారం-7కు సంబంధించిన దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్‌స్థాయిలోని మూడు బృందాలు పరిశీలిస్తున్నాయన్నారు. ఆ తర్వాత వచ్చే దరఖాస్తులను పరిశీలించి నియోజకవర్గ పరిధిలో ఫారం-7కి దరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను పరిశీలించేందుకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పించే ప్రక్రియ చేపడతామన్నారు. సప్లిమెంటరీ ఓటర్ల జాబితా ప్రకారం అదనపు పోలింగ్ స్టేషన్లకు అవసరమైన ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ అవగాహన గ్రూపులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో గత ఎన్నికల్లో ఎక్కడైతే రాష్ట్ర సగటు పోలింగ్ శాతం కన్నా తక్కువ నమోదైందో ఆ పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ లెవల్ అవగాహనా గ్రూపులను ఏర్పాటు చేసి సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశాలకు సంబంధిత అన్ని పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు, స్థానిక ప్రజాప్రతినిధులను, పంచాయతీ సిబ్బందిని పిలవాలన్నారు. స్థానిక సిఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసే స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను సంబంధిత రిటర్నింగ్ అధికారులు పరిశీలిస్తారని, వారితోపాటు రాజకీయ పక్షాల ప్రతినిధులు కూడా పరిశీలించవచ్చన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

పిఎం విశ్వకర్మ యోజన దరఖాస్తుల పరిశీలన

జిల్లాలో ప్రధాన మంత్రి విశ్వకర్మయోజన దరఖాస్తులను ర్యాండమ్ పరిశీలన చేసి వారం రోజుల్లో నివేదికను అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ గౌతమీ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విశ్వకర్మయోజన కింద వచ్చిన దరఖాస్తుల్లో వాస్తవికతను జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం, ఎల్‌డిఎం, డిఆర్‌డిఎ పీడీ, తదితర అధికారుల బృందంతో కూడిన పరిశీలించి తదుపరి మంజూరుకు నివేదిక సమర్పించాలన్నారు. దీనికి సంబంధించి ఎక్కడా అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ఉండేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జాలిపూడి ఘటనపై కలెక్టర్ స్పందిస్తూ అందుకు సంబంధించి విచారణ చేయాలని డిపిఒను ఆదేశించారు. ప్రతి గ్రామంలో కనీసం ఒక యూత్ క్లబ్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రతి గ్రూపులో కనీసం 10 నుంచి 15 మంది యువత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సింగిల్ విండో పథకం ద్వారా 319 దరఖాస్తులు అందగా వాటిలో 306 దరఖాస్తులు వివిధ శాఖల ద్వారా ఆమోదించారన్నారు. మరో ఆరు దరఖాస్తులు ఆయా శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. పారిశ్రామిక అభివృద్ధి పాలసీ కింద జిల్లాలోని ఆరు ఎంఎస్ఎంఇ, వైఎస్ఆర్ బడుగు వికాసం యూనిట్లకు రూ.13.89 లక్షలు వివిధ ప్రోత్సాహకాలను మంజూరు చేస్తూ సమావేశం తీర్మానించింది. జిల్లాలో 10 లేదా 10కి మించి మహిళా కార్మికులు ఉన్న పరిశ్రమల్లో పిల్లలకు పాలిచ్చే ప్రత్యేక గదులు, చైల్డ్‌కేర్ గదులను ఏర్పాటుచేసే చర్యలను కలెక్టర్ సమీక్షించారు. 110 పరిశ్రమలను గుర్తించగా వాటిలో ఇంతవరకు 101 చోట్ల ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారని, మిగిలినవి వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాధరావును కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పట్టిసీమ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు: ఎస్‌పి

ప్రజాశక్తి - పోలవరం

శివరాత్రి ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది యాత్రికులు వస్తారని అంచనా వేస్తున్నామని, ఆ సందర్భంగా యాత్రికులకు ఇబ్బంది లేకుండా పటిష్ట బందోబస్తుతోపాటు ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. మండలంలో పట్టిసీమలోని శ్రీ భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఉత్సవాల బందోబస్తు ఏర్పాట్లను శుక్రవారం ఆమె పరిశీలించారు. పోలవరం డిఎస్‌పి సురేష్‌కుమార్‌రెడ్డి, సిఐ మధుబాబు, ఎస్ఐ పవన్‌కుమార్ ఎస్‌పికి స్వాగతం పలికారు. ఆలయం వద్ద ప్రవేశ మార్గాలను, క్యూలైన్లను, పార్కింగ్ స్థలాలను ఆమె పరిశీలించారు. అనంతరం ఎస్‌పి మేరీప్రశాంతి మాట్లాడుతూ మార్చి 8న శివరాత్రి సందర్భంగా క్యూలైన్ల వద్ద తొక్కిసలాట జరగకుండా దేవదాయ, రెవెన్యూ అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని ఆదేశించారు. ఎస్‌పి వెంట దేవస్థానం ఇఒ సంగమేశ్వరశర్మ, వెంకటరాజు, ఫెర్రీ కాంట్రాక్టర్ బొరుసు రాంబాబు ఉన్నారు.

ఓటర్లలో చైతన్యానికి ప్రత్యేక చర్యలు

స్వీప్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో రాబోయే ఎన్నికల్లో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతాన్ని పెంచి ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లాలో స్వీప్ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా స్వీప్ కార్యక్రమాల అమలుకు కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఏలూరు కార్పొరేషన్ సమావేశ మందిరంలో శుక్రవారం 'సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోల్ పార్టిసిపేషన్' (స్వీప్) కార్యకలాపాలు, స్వీప్ 2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా నిర్వహించిన పట్టణ ఓటర్ల చైతన్య కార్యక్రమంలో డిపిఒ శ్రీనివాస విశ్వనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ ఓటర్లందరూ ఓటు వేసి సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 45 రోజుల స్వీప్ జిల్లా ప్రణాళిక అమలును డిపిఒ వివరించి జిల్లా ఏథికల్ ఓటింగ్ లక్ష్యం 92 శాతం అని, అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలని అన్నారు. జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలతో ఇవియం వినియోగం, ఓటింగ్ విధానం తదితర అంశాలలో ప్రజలను చైతన్య పర్చడానికి యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా మాధ్యమాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. జిల్లాలో ఓటర్ టర్నోవర్ ఇమ్లిమెంటేషన్ ప్లాన్ రూపొందించడం జరిగిందని, దానిని క్షేత్రస్థాయిలో పటిష్ఠంగా అమలు చేయడానికి అన్ని ప్రభుత్వ శాఖలు, స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకుంటున్నామని, దానిలో భాగంగా మున్సిపల్ కార్పొరేషన్, కార్మిక శాఖ సహకారంతో శుక్రవారం పట్టణ ప్రాంతంలో స్వీప్ ద్వారా ఏథికల్ ఓటింగ్, ఓటింగ్ శాతం పెంచడం, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. గత ఎన్నికల్లో జిల్లా సగటు ఎన్నికల పోలింగ్ 86 శాతం నమోదైతే, ఏలూరు పట్టణంలో కేవలం 68 శాతం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఏలూరు అర్బన్‌తోపాటు నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం ప్రాంతాల్లో కూడా ఓటర్ టర్నవుట్ పెంపు లక్ష్యంగా అన్ని ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. విభిన్న ప్రతిభావంతులు నూరుశాతం ఓటు వినియోగించుకునేలా, వృద్ధాశ్రమంలో వున్నవారు, ట్రాన్స్ జండర్స్‌లను గుర్తించి వారు ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను చెయ్యమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఇప్పటికే ఆదేశించినందున ఆ దిశగా కార్యాచరణ చేపట్టడం జరిగిందని తెలియజేశారు. అడిషనల్ కమీషనర్ చంద్రయ్య మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గం పరిధిలో ఓటర్ టర్నవుట్ పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు వారి అభీష్టంమేరకు ప్రశాంతంగా, సజావుగా తమ ఓటుహక్కు వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ నాగేశ్వరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ తిరుపతిరావు పాల్గొన్నారు.

పది విద్యార్థులు పరీక్షలకు సిద్ధం కావాలి

డిఇఒ ఎస్.అబ్రహం

ప్రజాశక్తి - భీమడోలు

పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కార్యాచరణ, ప్రణాళిక మేరకు పరీక్షలకు సిద్ధం కావాలని జిల్లా విద్యాధికారి ఎస్.అబ్రహం కోరారు. ఆయన శుక్రవారం భీమడోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు నెంబర్ వన్ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. భీమడోలు హైస్కూల్‌లో విద్యార్థులతో ఆయన మమేకమయ్యారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో పదవ తరగతికి హాజరయ్యే విద్యార్థులతో పాటు గత సంవత్సరం 10వ తరగతి ఉత్తీర్ణులు కాక, ప్రస్తుత సంవత్సరం తిరిగి పరీక్షలకు హాజరయ్యే వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. టోఫెల్ విద్యా విధానంలో ఆంగ్ల బోధన, ఇతర అంశాలపై మాట్లాడారు. పాఠశాలలో నెంబర్ వన్ ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థులను ఆయన కలిశారు. సబ్జెక్టుల వారీగా వారితో మాట్లాడారు. ఈ రెండు చోట్ల ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస రావు, సత్యనారాయణ విద్యార్థుల విద్యా ప్రగతి గురించి జిల్లా విద్యాధికారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు శ్రీనివాసరావు, భాస్కర్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ

'ఓట్ ఫర్ ఓపిఎస్' పుస్తకావిష్కరణ

నూతన పెన్షన్ రద్దుపై యుటిఎఫ్ పోరాటం : జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ముస్తఫా ఆలీ, రవి రుద్రాక్షి

ఏలూరు అర్బన్: 2004 నుంచి ప్రవేశపెట్టిన నూతన పెన్షన్ విధానం రద్దుపై యుటిఎఫ్ పోరాడుతూనే ఉందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముస్తఫ్ఫాలీ, రవి రుద్రాక్షి తెలిపారు. మన ఓటు-మన భవిష్యత్తు(ఓట్ ఫర్ ఓపిఎస్) పుస్తకావిష్కరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో గెలవడం కోసం కొన్ని రాజకీయ పార్టీలు పాత పెన్షన్ విధానం అమలు చేస్తామని వాగ్దానాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. భవిష్యత్తులో జరగబోయే ఎన్నికల్లో రాజకీయ అజెండాగా పాత పెన్షన్ విధానం కోసం యుటిఎఫ్ ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదం తీసుకుంది. మన రాష్ట్రంలో ప్రభుత్వం సిపిఎస్ కంటే జిపిఎస్ మెరుగంటూనే.. కార్పొరేట్లకు మరింత లాభాలు చేకూర్చే విధానాన్ని ముందుకు తీసుకువచ్చిందన్నారు. అందుకనే పాత పెన్షన్ పునరుద్ధరణ మా మేనిఫెస్టోలో చేరుస్తామని పార్టీలు చెప్పాల్సిన వైపు, ఎన్నికల తర్వాత పాత పెన్షన్ పునరుద్ధరిస్తూ మొదటి సంతకం చేస్తామని స్పష్ట వైఖరిని పార్టీలు తీసుకునే వారి వైపు యుటిఎఫ్ కార్యాచరణ ఉండబోతుందన్నారు. పాత పెన్షన్ ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కు మాత్రమే కాదు, భవిష్యత్తులో ఉద్యోగంలోకి రావాలనుకునే సాధారణ ప్రజల హక్కు కూడా. ఈరోజు ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్ హక్కు తీసేస్తే భవిష్యత్తులో ప్రజలకు ఇచ్చే సబ్సిడీలు తీసేస్తారని తెలిపారు. ప్రశ్నించే హక్కును, ప్రజాస్వామ్య హక్కులను తొలగిస్తారన్నారు. రాజ్యాంగ విలువలను కాలరాస్తారన్నారు. అందుకని ఏ హక్కు కోల్పోకుండా కాపాడుకోవాలంటే పోరాటమే మార్గమని తెలియజేశారు. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న నూతన పెన్షన్ విధానం స్థానంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గ్యారెంటీ పెన్షన్ కూడా సరైనది కాదని, మొత్తం ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేయాలని యుటిఎఫ్ డిమాండ్ చేస్తూందన్నారు. నూతన పెన్షన్ విధానంలో ఉన్నటువంటి లోపాలు, రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన గ్యారెంటీ పెన్షన్ జిపిఎస్‌లో ఉన్నటువంటి లోపాలు మొత్తం ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివరించే నిమిత్తం, అలాగే సిపిఎస్‌ని, జిపిఎస్‌ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, దానికి పోరాటం వైపు ఉపాధ్యాయులను, ఉద్యోగులను కదిలించే నిమిత్తం యుటిఎఫ్ పుస్తక రూపంలో మొత్తం వివరాలను అందించడం జరిగిందని తెలియజేశారు. ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో యుటిఎఫ్ ఏలూరు పూర్వపు రాష్ట్ర కార్యదర్శి పివి.నరసింహారావు, కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు కె.కిరణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం పాత పెన్షన్ విధానాన్ని జనసేన మేనిఫెస్టోలో చేర్చాలని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సమన్వయకర్త, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్ రావు, ఏలూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి, టిడిపి నాయకులు బడేటి చంటిని కలిసి ప్రాతినిధ్యం చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నేతలు

దోమల నిర్మూలనకు కృషి చేయాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ఏలూరు టౌన్: దోమలు మానవాళికి ప్రధాన శత్రువుగా పరిణమించాయని, దోమల నిర్మూలన ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యపడుతుందని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గజ్జలవారి చెరువు వైద్యాధికారి డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో తోటకూర దొడ్ల సచివాలయంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న గోవిందరావు మాట్లాడుతూ మురుగు నీటిలో పెరిగి, గృహాల్లో ఉంటూ మన రక్తాన్ని తాగి, ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్ గునియా, మెదడవాపు వంటి వ్యాధులు వ్యాప్తి చేసే దోమ మనకు నిజమైన శత్రువు అని పేర్కొన్నారు. దోమలు పెరిగే స్థలాలైనా నీటి నిల్వ ప్రాంతాలు, డ్రమ్ములు, మూతలు లేని నూతులు, టైర్లు, పగిలిపోయిన వస్తువులు, కొబ్బరి బొండాలు సంపులు, రుబ్బురోళ్లు, ఎయిర్ కూలర్స్, ఫ్రిజ్ వెనుక బాక్స్ మొదలగు స్థలాలలో దోమలు పెరుగుతాయన్నారు. కావున ప్రజలందరూ వారానికి ఒకటి, రెండుసార్లు నీటి నిలువ ప్రాంతాల్లో క్లీన్ చేసుకోవాలని, పనికిరాని వస్తువులు విసర్జించాలన్నారు. సాయంత్రం సమయంలో కిటికీలు, దోమతెరలు, మస్కిటో కాయిల్స్, మురికి నీటి నిల్వ ప్రాంతాల్లో వాడేసిన ఇంజన్ ఆయిల్ చల్లాలని, దోమల వ్యాప్తిని అరికట్టడంలో ప్రజలు సహకరించాలని సూచించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, జ్వరం వస్తే అశ్రద్ధ చేయకుండా ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలన్నారు. శీతాకాలంలో వైరల్ వ్యాధులు విజ్రంభించే అవకాశం వుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తత వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జి.శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు గంగా భవాని, మహాలక్ష్మి, విజయ, ప్రేమ రాణి, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రికి తగ్గ తనయ పావని

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మండల రాజకీయాల్లో మంచి గుర్తింపు సాధించి, ప్రజల మన్ననలు పొందిన కీర్తిశేషులు, మాజీ జెడ్‌పిటిసి బుసనబోయిన సత్యనారాయణ కుమార్తె ప్రతిష్టాత్మకమైన గ్రహంబెల్ అవార్డును కేంద్రమంత్రి నితిన్ గడ్కారీ చేతుల మీదగా అందుకున్నారు. ఉన్నత విద్యనభ్యసించి జాతీయస్థాయి పోటీల్లో నామినేషన్ పొందుపరిచి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆమెను పలువురు ప్రశంసించారు. గ్రామస్తులు సైతం ఆమె అవార్డు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆధునిక సాంకేతికతను అనుసరించి సైన్స్ అండ్ టెక్నాలజీలో జరిగే విప్లవాత్మక మార్పులకు సంబంధించిన నూతన ఆవిష్కరణలకు ఇటువంటి అవార్డులను 2010 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది ప్రకటిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగంలో ఆమెకు ఈ అవార్డు లభించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జాతీయ స్థాయిలో ఢిల్లీలో అవార్డు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పావని తెలియజేశారు.



అవార్డు అందుకుంటున్న పావని

హింసాత్మక చర్యలకు అడ్డుకట్ట వేయాలి

సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు నాణ్యమైన ధరను అందించాలని కోరుతూ నల్ల చట్టాలను రద్దు చేయాలని ఢిల్లీలో రైతులపై జరుగుతున్న హింసాత్మక చర్యలకు అడ్డుకట్ట వేయాలని సిపిఎం జిల్లా నాయకులు జి.రాజు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. వ్యవసాయ, విద్యుత్ మోటార్లకు మీటర్లు పెట్టడం, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడం, దళారుల వ్యవస్థను నిర్మూలించకపోవడం ఇలాంటి న్యాయమైన కోర్కెలపై వారు డిమాండ్ చేస్తుంటే వారిపై కేంద్ర ప్రభుత్వం ఖర్కశంగా వ్యవహరిస్తుందన్నారు. ఢిల్లీలో యువ రైతు నేతను పొట్టన పెట్టుకోవడం వంటి హింసాత్మక చర్యలకు బిజెపి పాల్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు చేపట్టడం బిజెపి ప్రభుత్వానికి వెన్నతో పెట్టిన విద్య లాంటిదని ఆయన విమర్శించారు.

ఎన్‌సిసి వాలంటీర్ల ప్రత్యేక శిబిరం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్‌సిసి యూనిట్ ఈనెల 23 నుంచి 29వ తేదీ వరకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ప్రతిపాటి విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ మెట్టగూడెం గ్రామంలో ప్రతిరోజూ వాలంటీర్లు పారిశుధ్యం, బాల్యవివాహాలు, నీటి పొదుపు, బాలికల విద్య, స్వచ్ఛ గ్రామం, యువత ఆరోగ్యం, చిరుధాన్యాల ప్రాధాన్యం, ఓటు ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రత, యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు.

శ్రమదానం చేస్తున్న వాలంటీర్లు

నూరు శాతం ఫలితాలకు కృషి : హెచ్‌ఎం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పదవ తరగతి విద్యార్థుల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా పరిషత్ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివిఎన్.సత్యనారాయణ తెలిపారు. నూజివీడు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పబ్లిక్ అవగాహనలో భాగంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు ప్రీ పబ్లిక్ పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ప్లస్ టు ఇంటర్ విద్యార్థులకు ఎన్విరాన్మెంటల్ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.


వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం జరుగుతుందని ఎంపిపి కోర్స పోసమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని వంకవారి గూడెం పంచాయతీలోని వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించడం కోసమే ప్రభుత్వం ఆరోగ్య సురక్ష శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సురక్ష క్యాంప్‌కి వచ్చిన వారికి పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ కెఎమ్.మంగతాయారు, సర్పంచి కుంజా పార్వతి, వైద్య సిబ్బంది హేమంత్, సుల్తాన, దీప్తి, సిహెచ్‌ఒ.శ్రీనివాసరాజు, పంచాయతీ సెక్రెటరీ ఖాజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయం చేయండి: వృద్ధురాలు ఆవేదన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తల్లిదండ్రుల నుంచి తనకు వచ్చిన భూమిని కాజేయాలని తన పెద్దనాన్న కుమారుడు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నాడని బుట్టాయగూడెం మండలం, సీతారామనగరానికి చెందిన గంధం సుబ్బాయమ్మ(72) అనే వృద్ధురాలు ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు శుక్రవారం మీడియాతో తన ఆవేదనను వెల్లబుచ్చుకుంది. మండలంలోని సీతారామ నగరంలో ఆర్ఎస్ నెం.58/6లో తమ తల్లిదండ్రులకు ఉన్న ఎకరం 3.68 సెంట్లు భూమి నుంచి తనకు వాటాదనంగా 1975 సంవత్సరంలో సంక్రమించిన ఎకరం భూమికి మల్లబత్తుల వెంకన్న తప్పుడు కాగితాలు సృష్టించి, తనను ఇబ్బందులకు గురి చేస్తూ ఆ భూమిని స్వాధీనపరచుకోవడానికి కుట్రలు పన్నుతున్నాడని ఆమె తన బాధను వ్యక్తపరిచింది. ఆ భూమికి సంబంధించి అన్ని అర్హతలతో కూడిన పత్రాలు తమ వద్ద ఉన్నా.. ఎటువంటి సంబంధం లేని మల్లాబత్తుల వెంకన్న ప్రొటెక్షన్ కాగితాలు మంజూరు చేయడం చాలా వేదనకు గురి చేస్తుందని ఆ వృద్ధురాలు వాపోయింది. గత 40 ఏళ్లుగా స్థానిక హక్కు భూ ఆక్రమణలో ఉండుటవలన గవర్నమెంటు(రెవెన్యూ) యంక్వైరీ చేసి తనకు పాస్‌బుక్, ఖాతా నెం.164, 1-బి పట్టాదారు అడంగల్, పహణి మంజూరు చేశారని ఆమె తెలిపింది. అడ్డదారుల్లో భూమికి ప్రొటెక్షన్ తీసుకొచ్చిన ఆ వ్యక్తి సహకరించకుండా తనకు తన భూమిని అప్పగించి న్యాయం చేయాలని ఆ వృద్ధురాలు కోరింది.


హక్కు పత్రాన్ని చూపిస్తున్న వృద్ధురాలు

నేరాలు - ఘోరాలు

నాటుసారా విక్రేతపై కేసు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలకేంద్రమైన టి.నరసాపురం పంచాయతీ పరిధిలోని మెట్టగూడెంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎఎస్‌ఐ వి.జయకుమార్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మెట్టగూడెంలో నాటుసారా విక్రయాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేయగా గ్రామానికి చెందిన వ్యక్తి తెల్ల టిన్నులో సారా విక్రయిస్తున్నాడన్నారు. పోలీసులను చూసి సారా టిన్ను వదిలి పరారయ్యాడని, దీంతో 9 లీటర్ల సారా సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రహదారి విస్తరణ పనులతో జనం అవస్థలు.!

ప్రమాదాల బారిన వాహనదారులు పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సెంటర్ నరకప్రాయంగా తయారైంది. ఎన్‌హెచ్ అధికారులు రహదారి విస్తరణ పనులను అసంపూర్తిగా చేయడంతో ప్రజలు, వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. పామర్రు - దిగమర్రు జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొలుత కాంట్రాక్టర్ ముదినేపల్లి సెంటర్‌లో సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. సుమారు 16 నెలల క్రితం చేపట్టిన సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులు అసంపూర్తిగా చేయడంతో ప్రజలు, వాహనదారులు, వ్యాపారులు, విద్యార్థులు పడరాని పాట్లు పడుతున్నారు. సెంటర్ అసాంతం సీసీ డ్రెయిన్లు ముక్కలు, ముక్కలుగా చేసి మధ్య మధ్యలో వదిలేశారు. దీంతో మురుగు నీరు బయటికి పారే అవకాశం లేకుండా పోయింది. రోజులు తరబడి అసంపూర్తిగా ఉన్న సీసీ డ్రెయిన్లలో మురుగు నీరు నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతుంది. దీంతో నివాసితులు, వ్యాపారులు, ప్రజలు రోడ్లపై రాకపోకలు సాగించాలంటే ముక్కులు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. మురుగునీరు నెలల తరబడి నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెంది జనాలపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలు జ్వరాలతో ఆసుపత్రుల పాలవుతున్నారు. సెంటర్‌లోని హోటళ్లు, నివాసితులు, ఇతర వ్యాపారులంతా వాడిన నీరంతా అసంపూర్తిగా ఉన్న డ్రెయిన్లలో చేరి బయటికి పారెందుకు అవకాశం లేకపోవడంతో రహదారిపైకి వచ్చి చేరుతుంది. రహదారిపై మురుగు ప్రవహించడంతో వాహనదారులు, పాదాచారులు, విద్యార్థులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనికి తోడు సెంటర్ మొత్తం గుంతలమయమై అత్యంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతల్లో ప్రయాణం నరకప్రాయంగా తయారైంది. ముదినేపల్లి సెంటర్ నుంచి ప్రయాణం చేయాలంటే ప్రజలు తమ ప్రాణాలను అరచేతుల్లో పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ముదినేపల్లి నాలుగు రోడ్ల ప్రధాన కూడలి ప్రాంతం కావడంతో నిత్యం వేలాది వాహనాలు ఈ సెంటర్ నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఒక పక్క రోడ్డు విస్తరణ పనులు జరుగుతుండడం, మరోపక్క వేలాది వాహనాలు ముదినేపల్లి సెంటర్ నుంచి రాకపోకలు సాగించడంతో ముదినేపల్లి గుంతలతో ప్రమాద భరితంగా ఉంది. ముదినేపల్లి నుంచి గుడివాడ, కైకలూరు, బంటుమిల్లి, గుడ్లవల్లేరు వెళ్లే రోడ్లు గుంతలతో దర్శనమిస్తూ ప్రయాణికుల పాలిట యమగండంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేస్తే ఇంటికి చేరతామో, లేదో తెలియని పరిస్థితి నెలకొంది. నిత్యం వాహనదారులు, ప్రయాణికులు ఈ గుంతల రోడ్డుల్లో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతూ క్షతగాత్రులుగా మారుతుండగా, మరికొందరు మృత్యువాత పడుతున్నారు. ఈ రోడ్లపై ప్రయాణించాలంటే జనం హడలెత్తిపోతున్నారు. ఈ రోడ్లలో నిత్యం పదుల సంఖ్యలో ప్రమాదాలు జరుగుతున్నాయంటే రోడ్ల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతుంది.

ఈ రోడ్డుల్లో స్కూల్ బస్సులు పిల్లలను ముదినేపల్లిలోనే వివిధ విద్యా సంస్థలకు తీసుకువస్తూ, సాయంత్రం గమ్య స్థానాలకు చేర్చుతుంటాయి. రోడ్లు అధ్వానంగా మారి యమ డేంజర్‌గా ఉండడంతో స్కూల్ బస్సులు, వ్యాన్లు ఈ రోడ్లలో ప్రమాదభరితంగా ప్రయాణం సాగిస్తున్నాయి. సెంటర్‌లో ఎదురెదురుగా రెండు వాహనాలు తప్పుకోవాలంటే డ్రైవర్లు శ్రమించాల్సిందే. గుంతల కారణంగా వాహనాలు తప్పుకునే క్రమంలో ట్రాఫిక్ జామ్ కావడంతోపాటు తరచూ మార్జిన్‌లో దిగబడి పోతున్నాయి. దీంతో ముదినేపల్లి సెంటర్ గుండా ప్రయాణం సాగించాలంటే వాహనదారులు, ప్రయాణికులు, విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారులు స్పందించి ముదినేపల్లి సెంటర్‌లో విస్తరణ పనులు, డ్రెయినేజీ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజల మానప్రాణాలు కాపాడాలని ముదినేపల్లి ప్రాంత ప్రజలు, వాహనచోధకులు అధికారులను ముక్తకంఠంతో కోరుతున్నారు.

రోడ్డుపైకి చేరిన మురుగునీరు

రోడ్డుకు అడ్డంగా అస్తవ్యస్తంగా నిర్మిస్తున్న డ్రెయిన్

పేదలకు ఉపాధి కరువైంది

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరుకు చుట్టుపక్కల ఉన్న ఏడు గ్రామపంచాయతీలను ఏలూరు నగరంలో విలీనం చేయడంతో పేదలకు ఉపాధి కరువైందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ విమర్శించారు. ఎండిఓ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులు కల్పించాలని కోరుతూ శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో పేదలకు ఉపాధి పనులు కల్పించాలని, వారిని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని, ఏలూరులో విలీనం చేసిన గ్రామాలను రద్దు చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 2020 సంవత్సరంలో ఏలూరు మున్సిపాలిటీలో కొంతమంది రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం 7 గ్రామ పంచాయతీలను విలీనం చేయడంతో వ్యవసాయ కుటుంబాలు, పేదలు, దళితులకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. పోణంగి గ్రామం ఏలూరులో విలీనం చేయడం ద్వారా ఈరోజు పేదలు, దళితులకు పనులు లేక వలసలు పోతున్న దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందన్నారు. వ్యవసాయ పనులు లేక మరోపక్క ఉపాధి హామీ పనులు పెట్టకపోవడంతో వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఒక్క పోణంగి గ్రామ పంచాయతీలోనే సుమారు 1400 జాబ్ కార్డులు రద్దయిపోవడంతో ఉపాధి పనులు లేక పేదలు, కూలీలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదలను, దళితులను ఉద్ధరిస్తామంటూ ఆర్భాటంగా ప్రచారం చేయటం తప్ప నిరుపేదలకు ఉపాధి కల్పించాల్సిన ఆలోచన లేకుండా పోయిందని విమర్శించారు. మరోపక్క చదువుకున్న యువతీ, యువకులు పట్టణ ప్రాంతాలకు, దూర ప్రాంతాలకు వలసలు పోయి కుటుంబాలను పోషించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు. గ్రామీణ అభివృద్ధి కోసం మహాత్మ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేదలందరికీ ఉపాధి చూపుతుందన్నారు. ఈ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నీరు కారుస్తుంటే పనులు రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేసే పరిస్థితి కనబడుతుందన్నారు. పేదలందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పించాల్సిన బాధ్యత మరిచి, ఏలూరులో విలీనం చేసిన నాటి నుంచి పేదలపైన పన్నుల పేరుతో భారాలు మోపుతుందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విలీనం చేసిన గ్రామీణ ఉపాధి చట్టం ద్వారా ఉపాధి హామీ పనులు 200 రోజులు కల్పించి, కనీసం రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు ఈ జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జి.దుర్గ, లక్ష్మణ్ నాయకత్వం వహించగా కుమారి పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు



భవన నిర్మాణ కార్మికునికి సహాయం చేస్తున్న మానవత సభ్యులు

భవన నిర్మాణ కార్మికునికి 'మానవత' సాయం

ప్రజాశక్తి - భీమడోలు

స్వచ్ఛంద సంస్థ భీమడోలు మానవత శాఖ రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టనుందని సంస్థ అధ్యక్షులు వట్టి సుగుణాకర్ తెలిపారు. సేవా కార్యక్రమంలో భాగంగా మానవత శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన నలుగురు నిరుపేద కుటుంబాలకు నిత్యావసర వస్తువులు, దుస్తులు పంపిణీ చేశారు. ఇదేక్రమంలో భాగంగా భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తూ ప్రమాదవశాస్తూ తీవ్రంగా గాయపడి రెండు కాళ్లు విరిగిన శ్రీనివాస్‌కు చికిత్స కోసం మానవతా రూ.5 వేల నగదు, శాఖ అధ్యక్షులు వట్టి సుగుణాకర్, పంచకర్ల సత్యనారాయణ మరొక ఐదు వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన కుటుంబానికి నిత్యావసర వస్తువులను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో శాఖ ఛైర్‌పర్సన్ జి.నూకరాజు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి కృషి

భీమడోలు: విద్యుత్ వినియోగదారుల న్యాయ, చట్టబద్ధమైన సమస్యల పరిష్కారానికి, వారి హక్కుల పరిరక్షణకు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ, విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం(సిజిఆర్ఎఫ్) పనిచేస్తుందని ఛైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ తెలిపారు. సిజిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో భీమడోలు కేంద్రంగా శుక్రవారం విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. పబ్లిక్ కోర్టు కార్యక్రమాన్ని చేపట్టారు. అంతకుముందు సిజిఆర్ఎఫ్ ఛైర్‌పర్సన్‌తో పాటు ఇతర సభ్యులు వి.జనార్ధన్ రావు, డాక్టర్ రాయసం సురేంద్ర కుమార్, భీమడోలు శ్రీవెంకటేశ్వర జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బొమ్ము రవికుమార్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు సదస్సులో చర్చించిన విషయాలపై అవగాహన కల్పించుకోవాలని కోరారు. తమకు, విద్యుత్ వినియోగదారులకు మధ్య వారధుల్లా పనిచేసి, వారి హక్కుల పట్ల విద్యుత్ వినియోగదారులను చైతన్య పరచాలన్నారు. అనంతరం వారికి కరపత్రాలను అందజేశారు. అనంతరం ట్రాన్స్కో ఆధ్వర్యంలో కొనసాగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ సిజిఆర్ఎఫ్ ఐదు ఉమ్మడి జిల్లాలు(కొత్తగా ఏర్పడిన 11 జిల్లాల స్థాయిలో) గల విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందన్నారు. ముందుగా వినియోగదారులు 1912 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, పరిష్కారం లభించకుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదులను వివిధ రూపాల్లో అందజేయవచ్చన్నారు. తమ ఫోరం ఇచ్చిన తీర్పుపై వినియోగదారులకు సంతృప్తి కలగకుండా విద్యుత్ అంబుడ్స్ మాన్‌కు ఫిర్యాదు సమర్పించాలని సూచించారు. ఇదే క్రమంలో తమ ఫోరంకు 7529 ఫిర్యాదుల రాగా 121 మినహా ఇతర సమస్యలను పరిష్కరించామన్నారు. గత సంవత్సరంతో పోల్చుకుంటే ప్రస్తుత సంవత్సరం ఫిర్యాదులు చేసే వారి సంఖ్య 106 వరకు పెరిగిందన్నారు. నష్టపరిహారంగా విచారణ అనంతరం 100 మంది వినియోగదారులకు రూ.5.40 లక్షలు పరిహార రూపంగా చెల్లింపులు జరిపామన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్కో డిఇలు ఝాన్సీ, నటరాజన్, ఎడిఇ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

మునిసిపల్ ఆఫీస్, పాలకొల్లు

ఆర్.ఓ.సి. నెం. 769/2015/ఇ1 ది.23-02-2024

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘము పరిధిలో నందు పురపాలక సంఘ నిధులతో 12వ వార్డులోని శ్రీ వేంకటేశ్వర నిలయం నుండి దాసిరెడ్డి అనిరుధ్ & ఎదురుగా నుండి రత్నవాసవి పాన్ షాప్ వరకు సి.సి.రోడ్డు, రామారావుపేటలోని ఫూట్ బ్రిడ్జిని వెడల్పు చేయు నిమిత్తం (2 పనులకు)గాను అంచనాలు విలువ సుమారు రూ. 34,95,000/-లతో మరియు GGMP నిధులతో సి.సి.రోడ్డు, సి.సి. డ్రైన్స్ మరియు కల్వర్ట్స్ నిర్మాణం నిమిత్తం (24 పనులకు)గాను అంచనాలు విలువ సుమారు రూ. 1,03,38,000/-లతో ఇ-ప్రొక్యూర్‌మెంటు ద్వారా టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెట్ నందు ది. 24-02-2024వ తేదీ సాయంత్రం 4.00 గం|| ని||ల నుండి లభించును.

మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్‌మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమగోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

సం/- బి.ఆర్.యస్.శేషాద్రి
మునిసిపల్ కమిషనరు, పాలకొల్లు

ఎత్తిపోతల రైతులకు న్యాయం చేయాలి

భూ నిర్వాసిత రైతుల సమావేశం డిమాండ్

చింతలపూడి : చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో భూములు కోల్పోయిన రైతులకు తీవ్ర అన్యాయం జరిగినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం చింతలపూడిలోని గురుభట్ల గూడెం రోడ్డులోని చిట్లూరి అంజిబాబు ఇంటి వద్ద చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ నిర్వాసిత రైతుల సమావేశం నిర్వహించారు. న్యాయమైన పరిహారం కోసం ఉద్యమం చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూసేకరణ కోసం నోటిఫికేషన్ ఇచ్చిన 5 సంవత్సరాల లోపు భూసేకరణ భూముల్లో ఎటువంటి కార్యక్రమాలు నిర్వహించకపోతే ఆ భూములు తిరిగి రైతులకు అప్పగించాలన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం భూ సేకరణ కోసం 2015, 2016లలో నోటిఫికేషన్ ఇచ్చారని, ఏడేళ్లు కావస్తున్నా రైతులకు పరిహారం ఇవ్వలేదన్నారు. కాబట్టి ఆ నోటిఫికేషన్లు రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇచ్చి ప్రయివేట్ మార్కెట్ విలువ ప్రకారం పట్టిసీమ ఎత్తిపోతల పథకం తరహాలో రైతులకు పరిహారం చెల్లించి, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గత టిడిపి ప్రభుత్వ కాలంలో రైతులు న్యాయమైన పరిహారం కోసం ఉద్యమం చేయగా అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్ రెడ్డి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి గడిచిన 5 సంవత్సరాల కాలంలో కనీసంగా కూడా పట్టించుకోలేదన్నారు. రైతుల భూములను రెవెన్యూ రికార్డుల్లో బ్లాక్ లిస్టులో పెట్టివేయడంతో కుటుంబ అవసరాల రీత్యా అమ్ముకోలేక, ఇటు ప్రభుత్వ పథకాలు, పంట రుణాలను పొందలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పోరాట కమిటీ అధ్యక్షులు ఖాదర్ బాబు రెడ్డి, చిట్లూరి అంజి బాబు, గోలి రామకృష్ణారెడ్డి, చిలుకూరి శ్రీహరి రెడ్డి, వనమాల రాంబాబు, కొనకళ్ల కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్యాలయం, పేరూరు
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం.04/2024 తేది.22-02-2024

ముదినేపల్లి మండలం, పేరూరు గ్రామపంచాయతీ యందు 2024-25 సంవత్సరమునకుగాను ఈదిగువ నుదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లయి చేయుటకు ది. 28-02-2024వ తేదీ మధ్యాహ్నం గం|| 2.00లకు పేరూరు గ్రామపంచాయతి కార్యాలయము నందు పంచాయతి కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించి, తిరిగి అదేరోజు మధ్యాహ్నం గం|| 2.30 ని||లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరములు	పనిచేయు కాలము	డిపాజిట్టు
1	పారిశుధ్య పనులు నిర్వహణ 1. కార్యాలయ పనుల నిమిత్తం 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	రూ. 3000/-
2	PWS స్కీము నిర్వహణ మోటారు ఆపరేటరుగా పనిచేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	
3	ఎలక్ట్రీషియన్ - వీధి దీపములు రిపేర్లు చేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	

సం/- శ్రీమతి పుట్టి మాధవిరాణి
సర్పంచ్, గ్రామపంచాయితీ, పేరూరు
ముదినేపల్లి మండలం

సం/- కె.శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, పేరూరు
ముదినేపల్లి మండలం

నాజర్ స్ఫూర్తితో ఎందరో కళాకారులు రూపొందారు

బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం బుర్రకథ పితామహుడు పద్మశ్రీ నాజర్ బుర్రకథను విని, స్ఫూర్తిని పొంది రాష్ట్రంలో ఎందరో బుర్రకథ కళాకారులుగా రూపొందారని, అందులో తాను ఒకడినని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు అన్నారు. పద్మశ్రీ నాజర్ 26వ వర్ధంతి సభ జంగారెడ్డిగూడెం ఎంబి క్లబ్ వద్ద ఎపి ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్ రాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా నాజర్ వర్ధంతి సభలో పలువురు బుర్రకథ, జానపద కళాకారులు, కవులు, గాయకులు పాల్గొన్నారు. సుబ్బి కనకారావు మాట్లాడుతూ 1920 ఫిబ్రవరి 5వ తేదీన గుంటూరు జిల్లా పొన్నెకల్లు గ్రామంలో షేక్ మస్తాన్, షేక్ బిబాబి దంపతులు ఆయన జన్మించారన్నారు. నాజర్ భజన పాటలు, కోలాటం పాటలు పాడుతూ ఆనాడు కమ్యూనిస్టు పార్టీ అగ్రనేత, నాటి ఎంఎల్ఏ వేములపల్లి శ్రీకృష్ణ కంట్లోపడ్డారని, నాజర్‌ను అక్కున చేర్చుకుని ప్రజానాట్యమండలి పాటల శిక్షణా శిబిరంలో నేర్పించగా మంచి గాయకుడయ్యారని తెలిపారు. ఆయన నరసరావుపేటకు చెందిన ముసుగుళ్ల సీతారామయ్య వద్ద సంగీతం నేర్చుకుని పాటల పోటీలలో ప్రథమ బహుమతి సాధించారన్నారు. ప్రజానాట్యమండలలో చేరి జంగం కులస్తుడు, బుర్రకథకుడైన రామకోటి ద్వారా బుర్రకథ బృందంలో చేరి కష్టజీవి బుర్రకథతో ఆయన ప్రధాన కథకుడైన నాజర్‌ను కమ్యూనిస్టు పార్టీ ఓల్ టైమర్‌గా తీసుకొని, కమ్యూనిస్టు పార్టీ బహిరంగ సభలో బుర్రకథలు చెప్పే అవకాశం ఎర్రజెండా కల్పించిందన్నారు. తాను ప్రత్యేక బుర్రకథ దళంగా ఏర్పడి, పల్నాటి యుద్ధం, బొబ్బిలి యుద్ధం కథలను నాజర్ స్వయంగా రాసి ప్రదర్శనలు ఇచ్చారన్నారు. బుర్రకథ అంటే నాజర్.. నాజర్ అంటే బుర్రకథ అనే విధంగా ప్రజల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుని కథకు స్ఫూర్తిదాతగా నిలిచారని కొనియాడారు. అనంతరం జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్.కృష్ణబాబు మాట్లాడారు. అనంతరం ప్రజానాట్యమండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టివిఎస్.రాజు, ఎల్ఆర్.కృష్ణబాబు తమ గురువైన సబ్బి కనకారావు, గురు తుల్యుడైన చిలుకూరి సుబ్బయ్యని శాలువతో ఘనంగా సత్కరించారు. ప్రముఖ కవి, రచయిత తిప్పాభట్ల రామకృష్ణ, ప్రముఖ నటి, గాయని చల్లా దీప్తిలను జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఆర్.కృష్ణబాబుల చేతుల మీదుగా శాలువతో ఘనంగా సన్మానించారు.

నాజర్‌కు నివాళులర్పిస్తూ..

గ్రామపంచాయతీ కార్యాలయం, దాకరం
ముదినేపల్లి మండలం, ఏలూరు జిల్లా

టెండరు ప్రకటన

ఆర్.ఓ.సి. నెం.05/2024 తేది.22-02-2024

ముదినేపల్లి మండలం, దాకరం గ్రామపంచాయతీ యందు 2024-25 సంవత్సరమునకుగాను ఈదిగువ నుదహరించిన పనులు చేయుటకు కాంట్రాక్టు లేబరును సప్లయి చేయుటకు ది. 28-02-2024వ తేదీ మధ్యాహ్నం గం|| 12.00లకు దాకరం గ్రామపంచాయతి కార్యాలయము నందు పంచాయతి కార్యదర్శి వారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని టెండర్లు స్వీకరించి, తిరిగి అదేరోజు మధ్యాహ్నం గం|| 2.30 ని||లకు హాజరు కాబడిన టెండరుదారుల సమక్షమున టెండర్లు తెరువబడును. మిగిలిన వివరములు కార్యాలయ పనివేళల యందు తెలుసుకొనవచ్చును.

వ.నెం.	పని వివరములు	పనిచేయు కాలము	డిపాజిట్టు
1	పారిశుధ్య పనులు నిర్వహణ 1. కార్యాలయ పనుల నిమిత్తం 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	రూ. 3000/-
2	PWS స్కీము నిర్వహణ స్కీము మోటారు ఆపరేటరుగా విధులు నిర్వహించుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	
3	ఎలక్ట్రీషియన్ - వీధి దీపములు రిపేర్లు చేయుటకు 1 ఒక వ్యక్తి	ది.01-4-2024 నుండి 31-3-2025 వరకు	

సం/- జాస్తి రాఘవేంద్రరావు
సర్పంచ్, గ్రామపంచాయితీ, దాకరం
ముదినేపల్లి మండలం

సం/- కె.శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి
గ్రామపంచాయతీ, దాకరం
ముదినేపల్లి మండలం